# నినాదం

సోమవారం
20 ఏప్రిల్
2026

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం


# జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా అంతోటి పాల్

**అభినందించిన వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల19(నినాదం) :** రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలను ప్రకటించిన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెక్రటరీగా నూతనంగా నియమితులైన కొత్తగూడెం చుంచుపల్లి మండల వాస్తవ్యులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతోటి పాల్‌ను వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ కొత్తగూడెం ఎదురుగడ్డ లోని తన స్వగృహంలో శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సహనం, సంయమనం ఎంతో అవసరమని, కాంగ్రెస్ పార్టీకి ఎన్ని ఉపద్రవాలు వచ్చినా పార్టీని విడనాడకుండా, సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నందుకు అంతోటి పాల్‌ను ఈ



పదవి వరించిందని, ఇది కాంగ్రెస్ పార్టీ అంతోటి పాల్ సేవలకు కట్టిన పట్టమని, కష్టపడి పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం ఇస్తుందని అంతోటి పాల్ ఎంపిక ఉదాహరణ అనిలి ఈ పదవి ద్వారా పాల్ సామాజిక చైతన్యంలోనూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిలోనూ పాటుపడి కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తేవాలని అభిలా షించారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో పాటు, అంతోటి పాల్‌ను అభినందించిన వారిలో సన్నిహితులైన ఏఐసీసీ బచావ్ సంవిధాన్ సభ్యులు ఏనుగుల అర్జునరావు, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోత్ కృష్ణ, ఐఎన్టీయూసీ విద్యుత్ రంగనాయకులు జానీ మియా, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుమంత్, జనార్ధన్, రాజేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం మహోత్సవం



**కాగజ్ నగర్, ఏప్రిల్ 19 (నినాదం ) :** కాగజ్ నగర్ పట్టణంలోని పద్మశాలి కుల బాంధవుల ఐక్యతకు ప్రతీకగా నూతన సేవా సంఘం కొలువుదీరింది పట్టణంలోని ఎల్ల గౌడ్ తోటలో గల పద్మశాలి కమ్యూనిటీ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తమ కృతజ్ఞతలను చాటుకున్నారు నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు పద్మశాలి సేవా సంఘం బలోపేతానికి ఈ క్రింది వారు కీలక బాధ్యతలు స్వీకరించారు అధ్యక్షులు గుల్లపల్లి నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శి వడ్నాల వెంకన్న కోశాధికారి కొక్కుల మురళి జాయింట్ సెక్రటరీ బోగ వెంకటేశం కుల సంక్షేమమే ధ్యేయం ఈ సందర్భంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పట్టణ పద్మశాలి కుల బాంధవులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు కులస్తుల సంక్షేమం, ఐక్యత కోసం నిరంతరం శ్రమిస్తామని వారు హామీ ఇచ్చారు. పద్మశాలి కుల బాంధవులకు సామాజికంగా గానీ వ్యక్తిగతంగా గానీ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి సమస్యల పరిష్కారానికి మేము శాయశక్తులా కృషి చేస్తాం. కుల సంఘం గౌరవాన్ని పెంపొందించేలా మా పనితీరు ఉంటుంది అని వారు స్పష్టం చేశారు. అలాగే, సంఘం కార్యకలాపాలను మరింత విస్తృతం చేసేందుకు గాను, అతి త్వరలోనే పూర్తిస్థాయి కమిటీని భర్తీ చేస్తామని, అర్హులైన, ఉత్సాహవంతులైన సభ్యులకు కమిటీలో చోటు కల్పిస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపార

## ఫెర్టిలైజర్స్ అసోషియేషన్ మండల నూతన కమిటీ ఎన్నిక




**గుండాల,ఏప్రిల్ 19 (నినాదం):** గుండాల మండల కేంద్ర పరిధి లోని రైతు వేదిక నందు ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశం లో సీడ్స్&ఫెర్టిలైజర్స్&పెస్టిసైడ్స్ అసోషియేషన్ మండల నూతన కమిటీ ని వ్యాపారస్తుల ఏకగ్రీవ తీర్మాణంలో మండల నూతన కమిటీ ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఫెర్టిలైజర్స్&పెస్టిసైడ్స్&సీడ్స్ వెల్ఫేర్ అస్సోసియేషన్ మండల అధ్యక్షులుగా తిరుక్కోవల్లూరి వెంకటేశ్వర్లు(పట్వారి వెంకన్న),జనరల్ సెక్రెటరీగా మానాల ప్రభాకర్,కోషాధికారిగా మాడే మంగయ్య,గౌరవ అధ్యక్షులుగా మానాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా చాట్ల సూర్యనారాయణ,బిచ్చల వీరస్వామి,జాయింట్ సెక్రటరీ గా పెంటి వేణు,ఈసీ గా పాయం భూషణం,ఈసం రాజబాబు లను ఎన్నుకోవడం జరిగింది.ఈ కమిటి 2026-2027 ,రెండు సంత్సరాలు ఈ కమిటీ నిర్వహన చేయడం జరుగుతుందని,తదనంతరం ఈ కమిటీ లోని సభ్యులందరం ఒక సమన్వయం తో అందరం కలిసి పనిచేయాలని అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మానాల వెంకటేశ్వర్లు,పట్వారి వెంకన్న,మాడే మంగయ్య,చాట్ల సత్యనారాయణ,బచ్చల వీరాస్వామి,పాయం నాగభూషణం,గొగ్గేల సుందర్ రావు,సనప సుధాకర్,కొడెం రమేష్,ఎట్టి లక్ష్మినారాయణ,వి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావుకు ఘన స్వాగతం



**చింతపల్లి, ఏప్రిల్ 19 (నినాదం) :** మాజీమంత్రి, సిద్దిపేట నియోజక వర్గ ఎమ్మెల్యే హరీష్ రావు హైదరాబాద్ నుంచి పెద్దవూర వెళ్తుండగా మార్గమధ్యలో మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ఆయనకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, ఘనంగా స్వాగతం పలికారు. ఎండను కూడా లెక్కచేయకుండా కార్యకర్తలు బి ఆర్ ఎస్. పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ఎంతో ఉత్సాహంగా హరీష్ రావును శాలువాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి, కేతావత్ భిల్యా నాయక్, మండల నాయకులు కుంభం శ్రీశైలం గౌడ్, మాజీ ఎంపిటిసి కుంభం శ్వేత, కురుమేడు సర్పంచ్ చెన్నమ్మ లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ రాపాక విజయరాజుకు ప్రతిష్టాత్మక ‘దళిత రత్న’ అవార్డు




**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 19(నినాదం):** రాపాక విజయరాజును ప్రతిష్టాత్మక ‘దళిత రత్న’ అవార్డు వరించింది. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అంబేద్కర్ కళాభవన్‌లో ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఉత్సవాల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాపాక విజయ రాజు ఈ అవార్డును అందుకున్నారు. ఉత్సవాల కమిటీ కో-చైర్మన్ సుదర్శన్ బాబు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, దళిత జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్ చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని పొందారు. ఈ సందర్భంగా రాపాక విజయరాజు మాట్లాడుతూ, దళిత రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, సామాజిక సాధికారత కోసం నా వంతు కృషిని మరింత ముమ్మరం చేస్తాను అని పేర్కొన్నారు. ఈ గుర్తింపునకు సహకరించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు, ఉత్సవాల కమిటీ సభ్యులకు, దళిత జర్నలిస్టుల ఫోరం కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు దుమ్మాటి శివకుమార్, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, పరంజ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనుష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగత్ ప్రకాష్, శ్రీను, కర్రోళ్ల అన్నమ్మ, సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఏ కరీంనగర్ సదస్సు విజయవంతం

**అవయవ దానంపై ప్రత్యేక అవగాహన**

**రాష్ట్రవ్యాప్తంగా వైద్యుల భారీ హాజరు... ఆధునిక వైద్య అంశాలపై ఉపన్యాసాలు**



**కరీంనగర్, ఏప్రిల్ 19(నినాదం) :** ప్రతిష్టాత్మక ఐఎంఏ కరీంనగర్ ఆధ్వర్యంలో ఒరేషన్స్ మరియు నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమం కరీంనగర్‌లోని ప్రతిమా మల్టీప్లెక్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మంది వైద్యులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. పి. కిషన్ ప్రారంభించగా, ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షురాలు డా. ఎ. శైలజా అధ్యక్షత వహించారు. మాజీ రాష్ట్ర అధ్యక్షులు, ఇతర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ వైద్య నిపుణులు స్మారక ఉపన్యాసాలు అందించారు. మాధవి నర్సింగ్ హోమ్ డా విజయ్ మోహన్ రెడ్డి జనరల్ పిజిషన్ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. సన్‌షైన్ హాస్పిటల్స్ ఛైర్మన్ డా. ఏ.వి. గురువా రెడ్డి, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ నిపుణుడు డా. మధుసూదన్, శిశు వైద్య నిపుణుడు డా. ఇంద్రశేఖరరావు తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. డా. శశికళ కోలా ప్రత్యేక అతిథిగా పాల్గొనగా, డా. బంగారి స్వామి గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల ప్రాధాన్యాన్ని వివరించారు. సదస్సులో ఆధునిక వైద్య రంగానికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై ఉపన్యాసాలు నిర్వహించగా, స్పీకర్లను ఐఎంఏ కరీంనగర్ సత్కరించింది. ప్రత్యేక ఆకర్షణగా జీవన్‌ధార ట్రస్ట్ ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. అవయవ దాతల కొరత, సామాజిక అపోహలు ఈ రంగంపై ప్రభావం చూపుతున్నాయని, ప్రజల్లో చైతన్యం పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచించారు. మీడియా కూడా అవగాహన పెంపులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సు వైద్య రంగంలో జ్ఞాన విస్తరణకు దోహదపడుతూ విజయవంతంగా ముగిసింది.

## నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలకు నాయకులు కార్యకర్తలు తరలి రావాలి

**మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకన్న యాదవ్**



**మునుగోడు, ఏప్రిల్ 19 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం, మర్రిగూడ మండల. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకన్న యాదవ్ మండల కేంద్రంలోని మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధినేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు.తేదీ: .20.4.2026 సోమవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ లోని టీ.టీ.డీ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ర్యాలీగా ఎన్టీఆర్ భవనంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించబడును తదుపరి ఎన్టీఆర్ భవనంలో ఏర్పాటుచేసిన 76 అడుగుల కటౌట్ కి పూల వర్షంతో అధినేత చంద్రబాబు నాయుడు 76వ , జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపడం జరుగుతుంది. కావున మునుగోడు నియోజకవర్గంలోని మాజీ కోఆర్డినేటర్లు, రాష్ట్ర నాయకులు, ఏడు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున, హైదరాబాదులోని ఎన్టీఆర్ భవనంకు తరలివచ్చి ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, తెలుగుదేశం పార్టీ మర్రిగూడ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలే మల్లేష్, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, బీసీ సెల్ అధ్యక్షులు కాసర్ల అంజయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు గునుగంటి శ్రీనివాసులు, దేవరకొండ సత్తయ్య, లెంకలపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు వరికుప్పల శ్రీనివాస్, లెంకలపల్లి గ్రామ వార్డు సభ్యులు బరిగల గణేష్, ఇందుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు వీరమల్ల మల్లేశం పాల్గొన్నారు.

## భీమదేవరపల్లి క్రాస్ రోడ్ వద్ద ఘోర ప్రమాదం

**ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు**





**భీమదేవరపల్లి, ఏప్రిల్ 19 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని భీమదేవరపల్లి క్రాస్ రోడ్ వద్ద ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హుస్నాబాద్ వైపు నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని, అనంతరం కరెంటు స్తంభాన్ని తాకి పక్కనున్న వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన చిలుముల భాస్కర్ (42) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా అత్యవసర వైద్య సిబ్బంది సహాయంతో వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. మృతుడు గాయపడిన వారు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి NH-765 పై భీమదేవరపల్లి మండలంలో వరుసగా ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేసి, భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# మహనీయుల ఆశయాలను సాధిద్దాం

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహనీయుల జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ**



**చేవెళ్ల ఏప్రిల్20 (నినాదం):** మహనీయుల ఆశయాలను సాధిద్దామని టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, 6వ వార్డు కౌన్సిలర్ దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 30న నిర్వహించనున్న మహనీయుల జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బసవేశ్వర మహరాజ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయాలైన సామాజిక న్యాయం, సమానత్వం, అంటరానితనం నిర్మూలన, అణగారిన వర్గాల అభ్యున్నతిని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వారి త్యాగాల బాటలో నడుస్తూ, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ, సమ్మిళిత సమాజాన్ని నిర్మించడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అని, మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహనీయుల జాతర కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బ్యాగరి నర్సింలు, మాజీ డైరెక్టర్లు వెంకటేష్, చాకలి కృష్ణ, సొసైటీ మాజీ డైరెక్టర్ నత్తి కృష్ణారెడ్డి, నాయకులు డీఎం చందు, పెంజర్ల అనంత్ రెడ్డి, తలారి యాదయ్య, గుడేన్నోళ్ల మాణిక్యం, బ్యాగరి అనిల్, రాంప్రసాద్, వెంకటేష్,గోపాల్, షరీఫ్, మహనీయుల కమిటీ వైస్ చైర్మన్ మాచన్ పల్లి రామస్వామి,మొకరం రాజు, చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్, కమిటీ సభ్యులు బ్యాగరి ప్రభాకర్, మల్లెపల్లి శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగాల భర్తీ చేపట్టాలి : నిరుద్యోగ భృతిని చెల్లించాలి..

**ఏఐవైఎఫ్ డిమాండ్**




**పాలేరు ఏప్రిల్ 19( నినాదం) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతను వంచించడం మానుకోవాలని,ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు తక్షణమే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని ఏఐవైఎఫ్,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి నిరుద్యోగులకు ఆకాశమే హద్దుగా వాగ్దానాలు చేసి, గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలోనూ, ప్రకటించిన విధంగా నిరుద్యోగ భృతిని అందించడంలోనూ పాలకులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు.హక్కుల సాధన కోసం నిరుద్యోగ యువత అంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రభుత్వాలు ఇప్పటికైనా మొండి వైఖరి వీడాలని హితవు పలికారు. లేనిపక్షంలో యువతను సంఘటితం చేసి ఉధృత పోరాటాలతో ప్రభుత్వాల మెడలు వంచుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్,నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు బాలిన కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బైక్ ఢీ

**ఎల్ఐసి ఏజెంట్ శ్రీనివాస్ మృతి**



**జమ్మికుంట, ఏప్రిల్ 19 (నినాదం) :** జమ్మికుంట పట్టణానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ కుసుమ శ్రీనివాస్(58) హనుమకొండ లో జరిగిన యాక్సిడెంట్ లో ఆదివారం సాయంత్రము అక్కడికక్కడే మరణిం చాడు. ప్రత్యక్ష సాక్షులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం జమ్మికుంట నుండి తన బైక్ పై భార్యాభర్తలిద్దరూ హనుమకొండలోని ఒక పెండ్లికి హాజరై తిరిగి జమ్మికుంటకు వస్తున్న తరుణంలో ఎర్రగట్టు గుట్ట దాటిన తర్వాత వెనుక నుండి ఒక ఆటో, బైక్ ను ఢీకొనడం వలన శ్రీనివాస్ అక్కడికక్కడే మరణించాడు. తన భార్య ఇందిరా సీరియస్ ఉండడంతో హన్మకొండలోని ఆదిత్య హాస్పిటల్ లో చేర్పించారు. శ్రీనివాస్ కు కూతురు, కుమారుడు ఉన్నారు. ఇల్లందకుంట మండలము సీతంపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ జమ్మికుంట లో స్థిరపడ్డాడు. స్థానిక బస్టాండ్ కు ఎదురుగా రంజిత్ టైలర్, మొబైల్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ హఠాత్ మరణంతో పిల్లలు దిక్కులేని వారు అయ్యారని బంధువులు రోధిస్తున్నారు. విషయం తెలుసుకున్న హుజురాబాద్, జమ్మికుంట లియోపి అధ్యక్ష, కార్యదర్శులు మొకిరాల సంపత్ రావు, మునిగాల సమ్మా రావు, కోశాధికారి గంటా సంపత్ లు వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో ఉన్న మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుసుమ శ్రీనివాస్ మరణం పట్ల ఎల్ఐసి ఏజెంట్లు తమ ప్రగడ సానుభూతిని తెలిపారు.

# కుల మతాల కన్నా మానవత్వం గొప్పది

**మైనార్టీల ఆధ్వర్యంలో మహనీయుల జాతర గోడపత్రిక ఆవిష్కరణ.**



**చేవెళ్ల ఏప్రిల్ 20 (నినాదం):** కుల మతాల కన్నా మానవత్వం గొప్పదని, మహనీయులు సూచించిన మార్గాల్లో పయనించాలని ఆంధ్రప్రదేశ్ మాజీ వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఖాదర్ భాషా అన్నారు. ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన మహనీయుల జాతరకు సంబంధించిన గోడపత్రికను ఆదివారం చేవెళ్ల మైనార్టీల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కుల, మతాల కన్న మానవత్వం గొప్పదన్నారు. మనుషులందరు సమానం అనే విషయాన్ని అందరు పాటించాలన్నారు. చదువుకున్నప్పుడే అందరు ఎదుగుతారని, అందుకే అంబేద్కర్ అందరికి చదువు ఇవ్వాలని కోరుకున్నాడన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ లాంటి మహనీయుల ఆశయాల సాధన కోసం అందరం కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహనీయుల కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్, సిరాజుద్దీన్, అబ్దుల్ జబ్బార్,హాజీ, ఖాజా పాషా, ఖాలెద్, మహమూద్, జాహెద్, చాన్, రెహ్మాన్, ఖదీర్ పాషా, చోటు, సలీం, అఫ్జల్, కలిమ్ , షరీఫ్, గఫూర్, మహనీయుల కమిటీ వైస్ చైర్మన్ మాచన్ పల్లి రామస్వామి,మొకరం రాజు, చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్, కమిటీ సభ్యులు బ్యాగరి ప్రభాకర్, మల్లెపల్లి శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## అపరమేధావి.గుగ్గిళ్ళ దివ్యమూర్తికి.. హైదరాబాదులో టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్






**పాలేరు ఏప్రిల్ 19( నినాదం) :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామా నికి చెందిన అపరమేధావి.గుగ్గిళ్ళ దివ్యమూర్తికి హైదరాబాదులోని త్యాగరాయగానసభలో ఆదివారం నాడు టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్ వరించింది. ఈ అవార్డును గుగ్గిళ్ళ దివ్యమూర్తి ప్రముఖ వ్యాపారవేత్త చిల్లా రాజశేఖర్ రెడ్డి మరియు మల్కాజ్గిరి విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్ రావు చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. తదనంతరం ప్రముఖులు గుగ్గిళ్ళ దివ్యమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు. దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి ఈ రికార్డును అందజేసినట్లు టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం తనకు సంతోషంగా ఉందని మరియు సన్మానం జరగడం సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటివరకు తనకు 75 అవార్డులు వచ్చాయని, 137 వేదికల మీద సన్మానం జరిగిందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రేవతి, చందు ఆంజనేయులు, గుర్రం విజయ్ కుమార్, రమేష్ తేజ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి దందా పై పోలీసుల కొరడా...

**మెట్ పల్లిలో ముఠా బట్టబయలు...**

**ఇద్దరు అరెస్ట్, 140 గ్రాముల గంజాయి స్వాధీనం**

**మెట్ పల్లి, ఏప్రిల్ 19 (నినాదం) :** పట్టణంలో గంజాయి విక్రయాలు సాగిస్తున్న ముఠాపై పోలీసులు కొరడా ఝులిపించారు. మెట్‌పల్లి పోలీసులు చేపట్టిన మెరుపు దాడిలో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు 140 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం... మెట్ పల్లికి చెందిన మల్యాల చందు, కోరుట్ల మండలం మోహన్‌రావుపేట కు చెందిన బాణాల రాజు కలిసి కొంతకాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నారు. మెదక్ ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లు గా మార్చి యువత, విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పక్కా సమాచారంతో ఆదివారం ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వైఎస్సార్ అర్బన్ కాలనీలో మెరుపు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి ప్యాకింగ్ చేస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు గంజాయి సరఫరా విషయాన్ని ఒప్పుకున్నట్లు వెల్లడించారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిపై గతంలో కూడా కేసులు ఉన్నట్లు సమాచారం.

**మెట్ పల్లి పోలీసులు హెచ్చరిక**

గంజాయి దందాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. మత్తు పదార్థాల వ్యాపారం, వినియోగం సమాజాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. యువత తప్పుదారులు పడకుండా జాగ్రత్తపడాలని, తల్లిదండ్రులు పిల్లల కదలికలపై నిఘా పెంచాలని ఎస్ఐ కిరణ్ కుమార్ సూచించారు.“గంజాయి అంటే గండం... దూరంగా ఉంటేనే భవిష్యత్ భద్రం” అంటూ పోలీసులు గట్టిగా హెచ్చరించారు.